# ఏకపాదుడు

ఏకపాదుడు గృహస్థాశ్రమంలో అడుగు పెట్టాడు. ఉద్దాలక మహర్షి కుమార్తె సుజాత అతని ఇల్లాలై, అతని సర్వస్వం అయింది. ధర్మానుబద్ధంగా అనుసరించవలసిన నిత్యానుష్ఠాన సమయంలో తప్ప, తక్కిన కాలమంతా సుజాత సాన్నిధ్యంలోనే అతని కాలం గడుస్తోంది. సంవత్సరాల నుంచీ క్రమశిక్షణలో పెరిగిన అతని శరీరమూ, మనసూ కూడా ఎంతో స్వతంత్రమయ్యాయనే భావం అనుక్షణం అతనికి కలుగుతోంది.

సుజాత దిన దినం కొత్తగా కనిపిస్తోంది అతని కళ్ళకు. ఆమె ఎర్రని అధరాలు అతను చుంబించిన కొద్దీ ఆరుణారుణాలవుతున్నాయి. ఆమె నల్లని కురులు నడుముపై అటు ఇటు కదలాడుతుంటే ఎంతో చిత్రంగా చూసేవాడు ఏకపాదుడు. ఆమె పాదాల మంజీరాల ధ్వనులు ఆతనికి మధురంగా వినిపిస్తుంటే, ఆమె వెంట వెంట తిరుగుతూ, తనను తాను మరిచిపోయేవాడు ఏకపాదుడు. ఆమె పల్చని చెక్కిళ్ళు నిగ నిగ లాడుతుంటే తన ప్రతిబింబం కనిపిస్తుందేమో నన్నట్లు ఆ చెక్కిళ్ళపై నుంచి చూపు తప్పించుకోలేకపోయాడు.

అనుక్షణమూ ఆమె సాన్నిధ్యంలోనే ఉండాలనే కోరిక ఏకపాదునిలో ఎక్కువ కాజొచ్చింది. తను ఆరాధించే ప్రేమైకమూర్తి తన సాంగత్యాన్ని ఇంతగా అభిలషించడం సుజాతకు ఎంతో తృప్తిని, ఆనందాన్ని చేకూర్చింది.

కాలం గడుస్తోంది. ఏకపాదుని పాండిత్య వైభవం, వేదాధ్యయన దీక్ష ప్రఖ్యాత మవటంతో, అతని శిష్యుల సంఖ్య పెరిగింది. శిష్యుల అధ్యయన విషయంలో ఎక్కువ కట్టుదిట్టమైన పద్ధతులలో విశ్వాసమున్నవాడు ఏకపాదుడు. శిష్యుల అధ్యయన బాధ్యత తనే వహించి, విద్యాబోధ ధర్మకార్యంగా భావించేవాడు.

గురుత్వం లభించటంతో ఏకపాదుని నిత్య విధులు రెండయినాయి. అధ్యాపకత్వం, సుజాత ఆరాధన. సుజాత బాధ్యతలూ పెరిగాయి. ఏకపాదుని ప్రియురాలిగా, ఇల్లాలిగా ఆమె నిర్వహించవలసిన విధులు పెరిగాయి.

యౌవనోద్రేకానికి కట్టలు వేసి, తను మాతృమూర్తి కావాలనే కోరిక ఆమెకు గాఢంగా కలిగింది.

ఆనాడు ఏకపాదుడు అనధ్యయనం ప్రకటించాడు. వాతావరణం ప్రశాంతంగా ఉంది. సుజాత ఏకపాదుని వద్ద కూర్చుంది. చల్లగా గాలి శరీరానికి హాయి నిస్తోంది. ఏకపాదుని ముఖంలోకి చూస్తూ, మాతృత్వపు వాంఛ గురించి నెమ్మదిగా ప్రస్తావించింది.

ఏకపాదుడు మాట్లాడలేదు. అతని ముఖంలో ప్రశాంతత మాయమయింది. ఆనంద రేఖలు భగ్నమయ్యాయి.

"సుజాతా, సద్గతుల కోసం సంతానం అవసరమే. కానీ మన కిప్పుడే ఎందుకు తొందర? ఆ బరువు బాధ్యతలు నేను సహించలేను ఇప్పుడు. ఇప్పుడు నా లోకమంతా నిండింది నువ్వే - నువ్వే నా సర్వస్వం. అన్నిటి కన్నా, నీ ప్రేమను నేను ఎవరితోనూ పంచుకోలేను. సంతానం కలిగాక నానుండి నువ్వు కొంతయినా దూరం కాక తప్పదు. నే నది భరించలేను సుజాతా!''

ఏకపాదుని మాటల్లోని బరువు తిన్నగా సుజాత గుండెల్ని గుచ్చుకుంది. ఆ మాటలకు ఆశ్చర్యం కలిగినా, తన ప్రేమను సంపూర్ణంగా పొందాలనే తన భర్త అభిలాషకు ఆమె మనసు ఆనందంతో, తృప్తితో నిండిపోయింది.

ఋతువులు, సంవత్సరాలు గడుస్తున్నాయి. ఏకపాదుడు, సుజాతల అన్యోన్యానురాగం దినదిన ప్రవర్ధమానమవుతోంది. సుజాతలోని సంతానవాంఛ వీడటం లేదని గ్రహించిన ఏకపాదుడు, ఆమె కోరిక ధర్మబద్ధమేనని అనుకోటం మొదలుపెట్టాడు కొన్నిసార్లు.

సుజాత గర్భవతి అయింది. ఏకపాదుని ప్రేమానురాగాలు అనుక్షణం అనుభవిస్తూంది సుజాత. గర్భస్థ శిశువు సుజాత తన కందించే ప్రేమకు అడ్డమని అప్పుడప్పుడు అనిపించేది ఏకపాదునికి.

ఏకపాదుడు శిష్యులచేత అధ్యయనం చేయిస్తుంటే అతని చెంతనే కూర్చునేది సుజాత. సుజాత ప్రసవిస్తే ఆమె ప్రేమ తన పసివాడిపై మరల్చి, తనని దూరం చేస్తుందా అనే భావం రోజురోజుకీ ఏకపాధునిలో పెరుగుతోంది. గర్భస్థ శిశువుపై ఎలాటి మమకారం పెంచుకోలేకపోయాడు ఏకపాదుడు.

కొన్నిసార్లు కోపోద్రిక్తుడైన ఏకపాదుడు, తన కోపాన్ని శిష్యులపై మళ్ళించేవాడు. శిష్యులపై విధించే నియమాలు ఎక్కువయ్యాయి. శిక్షణ ఎక్కువైంది. అహోరాత్రులు నిద్రాహారాలు లేక వేదపఠనంలో మునిగిపోయేలా చేశాడు శిష్యుల్ని. వారి శక్తి సామర్థ్యాలు అతను పట్టించుకోవటం లేదు. నిద్రాహారాలు లేక వారు కృశిస్తున్నారు. శరీరంలో బలంలేక వారు బడలిక చెందుతున్నారు. ఇవన్నీ గమనించిన సుజాత విద్యార్థులకు అంత కఠిన నియమాలు వద్దని, వారు నిద్రాహారాలులేక కష్టపడుతున్నారని, వేదాధ్యయనకాలం తగ్గించమని చెప్దామనుకుంది భర్తతో. కానీ ఆమెకు ధైర్యం చాలలేదు.

సుజాత గర్భస్థ శిశువు మాతామహుడైన ఉద్దాలక మహర్షి పాండిత్యాన్ని, తండ్రి ఏకపాదుని క్రమశిక్షణ, నియమనిష్ఠలను మాతృగర్భంలో ఉండే ఒంట పట్టించుకున్నాడు.

తన తండ్రి శిష్యులకు అతి కఠినమైన తీరులో వేదాధ్యయనం చేయించటం, నిద్రాహారాలు లేక మందబుద్ధులై ఆ శిష్యులు అపస్వరాలు ఉచ్చరించటం గమనించాడు. అతను అది భరించలేక, ఒకనాడు తండ్రితో సూచనప్రాయంగా అన్నాడు.

సుజాతపై తన ప్రేమకు అడ్డం తగులుతున్న గర్భస్థ శిశువుపై ముందే కోపమున్న ఏకపాదునికి, ఆ శిశువు తన అధ్యయన విధానాన్ని అధిక్షేపించటం అగ్నిపై ఆజ్యం జల్లినట్లయింది. ఏకపాదుని కోపోద్రిక్తత కట్టలు తెంచుకుంది. వేదాధ్యయనానికి వక్రభాష్యం చేస్తున్నాడనే భావం ఆతన్ని కదిలించివేసింది. "అధ్యయనానికి వక్రంగా భాష్యం చెప్తున్నావు కనక, నీవు వంకరలు తిరిగిన శరీరంతో జన్మించు" అన్నాడు వెంటనే.

సుజాత అవాక్కయిపోయింది. గజగజ లాడిపోయింది. తన భర్తమాట ఊరికేపోదు. భయంతో భర్తవంక చూసింది. ఆ చూపుల్లో తన ఎడగల ప్రేమ ఉప్పొంగి పొరలినట్లనిపించింది ఏకపాదునికి.

ఏకపాదుడు పునరాలోచన చేశాడు.

"సుజాతా! తొందరపడ్డాను. నీమీద ఎడతెగని ప్రేమ, ప్రస్తుతం సంతానంపై నాకున్న విముఖత ఈ కోపాన్ని ప్రేరేపించాయి. కానీ, భయపడకు. నీ గర్భస్థ శిశువు శరీర వక్రత అతని కీర్తి ప్రతిష్ఠలకు, తేజస్సుకు, అతని

పాండిత్యానికి, అతని శీల సంపదకూ ఏ విధంగానూ అడ్డంరాదు. అతను గొప్ప కీర్తి ప్రఖ్యాతులు సంపాదించుకుంటాడు. నా మాట నమ్ము." ఏకపాదుడు ఆమె చెక్కిళ్ళు చుంబించాడు. ఆమె అధరాలు స్పందిస్తుంటే, సున్నితంగా గుండెలకి హత్తుకున్నాడు.

సుజాతకి కొంత తృప్తి కలిగింది, తన గర్భస్థ శిశువు భవిష్యత్తు ఆశాజనకంగా కన్పించటం వల్ల.

"సుజాతా, నా తొందరకు నేనే చింతిస్తున్నాను. నీ గర్భస్థ శిశువు ఆశ్రమ విద్యావిధానాన్నే మార్చివేయగల మహనీయుడవుతాడు. బృహస్పతికి మించిన బుద్ధితో, సరస్వతిని వశం చేసుకోగల విద్వాంసుడవుతాడు." సుజాత శిరసు నిమిరాడు ఏకపాదుడు.

సుజాతకు భర్త మాటలు అమృతపు జల్లుల్లా హాయిగొల్పాయి. గర్భస్థ శిశువుపై అతని అనురాగం పెంచుకుంటున్నందుకు, తనపై అమితమైన ప్రేమ నింపుకున్నందుకు సుజాత ఆనందంతో పరవశించింది.

ఆనంద బాష్పాలు ఆమె కళ్ళలో నిండుతుంటే ఏకపాదుని వక్షస్థలంపై వాలిపోయింది సుజాత.

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం: అరణ్యపర్వం : తృతీయాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక : 1-6-1988)